# బహుళ చంద్రిక

(1983)

సిటీబస్సు దిగి నడుస్తోంది కాళింది—ఆ నడకలో ఉత్సాహముంది—వేగముంది—రోజూ వేసే అడుగుల్లా భారంగా లేవా అడుగులు. పర్మిషన్ తీసుకుని రెండు గంటల ముందే బయలుదేరింది ఆఫీసు నుండి—ఈ రోజుతో తన జీతం ఒక కొత్త మలుపు తిరగబోతూంది—ఈనాడు తనీ నిర్ణయం తీసుకోకపోతే తన కిక జీవితం మిగలదు!

బడిపంతులుగా రిటైరై కనీసం పింఛనైనా రప్పించుకోలేని తండ్రి తనకు పెళ్ళి చెయ్యలేదు—ఆదవా · చెయ్యాలనుకున్నా నాలుగైదువేలకి ఆశపడి తనను చేసుకోడానికి ఎవరూ ముందుకు రారు—సంబంధాల కేం చాలానే వచ్చాయి—కట్నంసరిపోలేదన్న అసంతృప్తిని ఒక్కొక్కరు ఒక్కోలా వ్యక్తపరచారు.

ఎదుటి వ్యక్తిలోని సద్గుణాల్ని మెచ్చుకోడానికి చక్కని హృదయం కావాలి. ఎంచడానికి ఎన్నైనా లోపాలు కన్పిస్తాయి—

రోజూ యిట్టే వచ్చేసే యిల్లు ఎంత దూరమనిపిస్తోందీ రోజు! ఆతృత అటువంటిది! ఈ రోజుతో తనకీ ఆ యింటికీ ఋణం తీరిపోతుంది—కరుణానిధితో పంచుకోబోయే తన జీవితం సుఖమయమౌతుందనే ఆశ వుంది—లేదూ... స్వయంకృతాపరాధానికి అనుభవిస్తుంది....

తన వయస్సు పాతికేళ్ళు దాటిపోయింది—పదో పన్నెండో సంబంధాలూ తప్పిపోయాయి.

తను ఓణీ వేసిన కొత్తలో ఐదువేల రూపాయలకున్న విలువ యిప్పుడు రెండువేలకి పడిపోయింది—జీతం మాత్రం ఫస్టుకీ యిరవయ్యో తారీఖుకీ అందనంత గానే వుంది. ఇక జీవితంలో రిస్కు తీసుకోకపోతే ఎలా?

గోదావరిఎక్స్‌ప్రెస్ అయిదున్నరకి బయల్దేరుతుంది-తనుయింటి కెళ్ళి స్నానంచేసి బట్టలు మార్చుకుని వెళ్ళిపోడమే-తనసూట్ కేస్‌ను ముందుగానే స్నేహితురాలింట్లో వుంచింది రహస్యంగా. తన కోసం స్టేషన్‌లోకరుణానిధి వుంటాడు. అంతే! రైలెక్కి యేయేడుకొండలమీదో పెళ్ళి చేసుకుని వచ్చేస్తారు. అప్పుడు చూడాలి అందరి ముఖాలూనూ.

'కుటుంబ మర్యాదల్ని మంట గలిపి కులం తక్కువవాడితో లేచి పోయావ్. ఇక నీ ముఖం నాకు చూపించకు' అంటూ తిడతాడు నాన్న-

చీరకొంగు నోటిలో పెట్టుకొని లోపల్లోపలే యేడుస్తుంది అమ్మ-

తమ్ముడూ చెల్లాయి తననో శత్రువులా చూస్తారు.

'ఉద్యోగం దాని కళ్ళను నెత్తికెక్కించింది- ఉద్యోగం మాన్పించి యే బడిపంతులుకో' గ్రామ కరణానికో కట్టబెట్టేస్తే బాగుండేది. నా మాట వినుకుండా నువ్వే దాన్నలా తయారు చేసేవ్' అంటూ పెదనాన్నలూ, అత్తయ్యలూ తండ్రినే తిడతారు-

ఆ తిట్లూ, యేడ్పులూ ఎన్నాళ్ళుంటాయి?

తన డబ్బు ముందు అన్నీ మాయమైపోతాయి-

0 0 0

తలెత్తి యింటివైపు చూసింది కాళింది-గుమ్మంలోంచి ఎవరో నలుగురైదుగురు లోపలికి తొంగి చూస్తున్నారు.

బంధువు లెవరైనా వూడి పడ్డారా? ఎవరెలా చచ్చినా తను మాత్రం ఆగదు-తన నిర్ణయం మారదు!

గుమ్మం దాటి లోపలకు అడుగు పెట్టిన కాళిందిని చూసి గొల్లుమన్నారంతా-

అక్కడి దృశ్యాన్ని చూసి అవాక్కయి నిల్చుండిపోయింది-

కాళింది చెల్లెలు మాలతి పరుగున వచ్చి అక్కయ్యను పట్టుకుని బావురుమంది—పమిటచెంగు నోట్లో దోపుకుని స్తంభానికి జేరగిలబడి ఏడుస్తోంది తల్లి—అరుగుకింద అఖరి మెట్టుమీద కూర్చుని వాకిట్లో నేల మీదుంచిన తండ్రి శరీరం వంక చూస్తున్నాడు తమ్ముడు—

"ఉదయం పూజ అయ్యేవరకూ బాగానే వున్నారు—భోజనానికి కూర్చుని గుండె నొప్పంటూ వెనక్కి తిరగబడిపోయారు. డాక్టరొచ్చే సర్కి అంతా అయిపోయింది...." ఎవరో చావు వివరాలు చల్లగా చెప్పేరు....

కాళింది శరీరం ఒక్కమారు కంపించింది. పరుగెత్తుకెళ్ళి తండ్రి శవంమీద పడి బావురుమంది. కట్టతెగిన గోదారిలా దుఃఖం పొంగి పొరలింది.... కన్నీళ్ళయిపోయేవరకూ యేడ్చింది–

ఊళ్ళో వున్న బంధువులూ తెల్సినవాళ్ళూ పోగయ్యారు. చూసిన వాళ్ళు ఒక్కొక్కరే వెళుతున్నారు. తల్లి ముఖంలోకి చూడ్డానికి కాళిందికి ధైర్యం చాల్లేదు. ఆ దుఃఖాన్ని ఆపి ఆమెను సముదాయించే శక్తి తనకు లేదు—

తండ్రివంక చూసింది. ఏ దిగులూ లేకుండా నిశ్చింతగా వుందాయన ముఖం.

తండ్రి తనకేం చేశాడా? ఏం చెయ్యలేదు? ఆ మాటకొస్తే ఒక్క పెళ్ళి తప్ప తండ్రి తన బాగోగులన్నీ చూళ్ళేదూ? ఆయన చేతులమీదుగా పెళ్ళి జరిపించుకునే గీత లేదేమో తనకు! ప్రయోజకుడౌతాడన్న కొడుకు తనకు తానే ప్రయోజకుడై పెళ్ళి చేసుకుని కుటుంబానికి కొరగానివాడుగా తయారైనా తండ్రి పెదవి మెదపలేదు.

"నాకు వాడొక్కడే సంతానం కాదు" అనేవారు. ఆ గుండె నిబ్బరంతోనే తనను చదివించి ఉద్యోగంలో వేయించాడు.

0 0 0

"కాళిందీ, ఒక్కమారిలా రామ్మా" పక్కింటి అవధానిగారు పిలవడంతో ఆలోచనల్లోంచి తప్పుకుని లేచింది.

మళ్ళీ లెక్కలూ, వ్యవహారాలూ! ప్రాపంచికాలు మొదలు గావును!

"మీ అన్నయ్య వెంకట్రావుకి టెలిగ్రాం యిచ్చేం — ఇంకా వార్త పంపడానికి ముఖ్యులెవరయినా వున్నారా?"

లేరన్నట్లు తలూపింది కాళింది. బంధువుల్లో ముఖ్యులైన పెదనాన్నలూ, అత్తయ్యలూ ఆ వూళ్ళోనే వుండటంవలన అందరూ వచ్చేసేరు.

"మా అందర్లోకీ ఆఖరివాడు.... వాడి చావు మా కళ్ళతో చూడాల్సి వస్తుందనుకోలేదు —" శోకం తెచ్చిన నిర్లిప్తతతో అన్నాడు పెదనాన్న.

"ముసలి ముండని — నాకు రాకూడదా ఆ చావు. ఆ పిల్ల ముండ నెత్తిన నాలుగక్షింతలు వెయ్యకుండానే పోయాడు —" ఏడుస్తోంది, ఎనభై యేళ్ళ పెద్దత్తయ్య.

వీళ్ళ ఏడుపు చూస్తుంటే కాళిందికి యేడుపు ఆగిపోయింది.

ఎవరెవరో వచ్చి వెళుతున్నారు. ఆయనతో కలిసి పనిచేసినవాళ్ళూ ఆయన దగ్గర చదువుకుని వృద్ధిలోకి వచ్చినవాళ్ళూ — ప్రయివేటు పిల్లలు కూడ చాలమంది పోగయ్యారు.

"నువ్వు చెప్పే చదువు మా భావి భారత పౌరుల కిక అక్కర్లేదని" ప్రభుత్వం ఆయన్ని రిటైరు చేసినా ఆయన చెప్పే పద్ధతిపై యిష్టమున్న పిల్లలు ఆయన్ను వదల్లేదు — రావాల్సిన పెన్షన్ డబ్బులు తగువుల్లో పడి ఆగిపోయినా ప్రైవేట్లమీద వచ్చే సంపాదనే ఆయనను చివరిదశలో ఆదుకుంది.

"ఆడపిల్లకు పెళ్ళిచేసి పంపాల్సింది పోయి దానిసొమ్ము తింటు

న్నామండీ" అని తల్లి అనడం ఎన్నోమార్లు వింది కాళింది. తండ్రి మాట్లాడేవాడు కాదు.... నోరిప్పినా జాతకం....అదృష్టం....ఘటనా.... అంతే!

ఆ మూడూ కలిసొచ్చేదెప్పుడు? తనకి పెళ్ళయే దెప్పుడు? వీళ్ళ కడుపున పడ్డ పాపానికి సంపాదించి పొయ్యాల్సిందే అని విసుక్కునేది.

కాళింది బుర్ర ఆలోచనలతో గజిబిజిగా తయారైంది—

చీకట్లు ముసురుకుంటున్నాయి- టైం ఆరవుతోంది!

గోదావరి ఎక్స్‌ప్రెస్ వెళ్ళిపోయి వుంటుంది. ఏ దేవుడి సన్నిధికో చేర్చి తన జీవితంలో యేర్పడబోయే మలుపుకు దోహదకారి కావాల్సిన రైలు వెళ్ళిపోయే వుంటుంది— తనకోసం యెదురు చూసి ఎదురు చూసి, విసిగి వేసారి కరుణానిధి తిరుగు ముఖం పట్టి వుంటాడు రేపట్నించీ తన ముఖం చూడకూడదని నిశ్చయించుకునే వుంటాడు!

కాళిందికి దుఃఖం ముంచుకొచ్చింది....

అందుకోబోయేంతలోనే అందమైన జీవితం జారిపోయింది.

కరుణానిధి తన జీవితంలోకి వింతగా పరిచయమయ్యాడు. అతడు తన బాస్. ఓరోజు— సాయంత్రం యింటికి బయల్దేరే ముందు పిలుపొచ్చింది....రెండు పేజీల డిక్టేషను— తీసుకుని పెయిర్ కాపీ టైప్ చేసేసరికి ఆరు దాటింది. శీతాకాలపు సాయంకాలం— చీకట్లు ముసురుకున్నాయి—

లెటర్ సంతకం చేసి కవర్లోపెట్టి స్పెషల్ మెసెంజర్ ద్వారా పంపించాక తనవైపు తిరిగాడు రిలాక్సింగ్‌గా.

"సారీ, మిమ్మల్ని డీటైన్ చేశాను. మీరెలా వెళ్తారూ?"

"ఫర్వాలేదు. బస్సులుంటాయి" అంది తను యిబ్బందిగా కదిలి.

"ఇఫ్ యూ డోంట్ మైండ్ నాకోసం జీప్ వస్తుంది. మీరూ రావచ్చు" అంటూ లేచాడు.

తనేం మాట్లాడలేక పోయింది.

జీపులో వస్తూ అడిగడు. 'మీ ఫాదర్ ఏం చేస్తుంటారు?' అని.

చెప్పింది.

ఆ తర్వాత కుటుంబ విషయాలూ—

0 0 0

"అమ్మా కాళిందీ, ఒక్క మాట—"

తల తిప్పిచూసింది. పెదనాన్న!

"వెంకట్రావు కిచ్చిన టెలిగ్రాం ఈ పాటికి అందే వుంటుంది. అర్ధరాత్రి బయల్దేరినా తెల్లారేసరిక్కి రావాలి. అదరాబాదరాగా బయల్దేరి వచ్చేస్తాడేమో— నీ దగ్గరేమన్నా" అని ఆగేడాయన.

"ఏవిఁటి పెదనాన్నా?"

"అదేనమ్మా. రేపటి తంతుకు చాలానే కావాల్సి వస్తుందిగా!"

కాళిందికి సమస్య అర్ధమైంది.

"చిన్నవాడైనా వాడే అందరి కష్టానికీ, సుఖానికీ ఆదుకున్నాడు. వాడికే మే మెవ్వరం ఉపయోగపడలేకపోతున్నాం" అంటున్నాడాయన.

అవును మరి! యిద్దరు కొడుకుల్ని కాలేజీలో చదివిస్తూ, ఉన్న ఒక్క పిల్లకూ అయినింటి సంబంధం చేసి చితికిపోయిన పెదనాన్న ఎవరికి మాత్రం ఏం సాయం చేయగలడు?

కాళింది నిట్టూర్చింది. నాలుగేళ్ళయి ఉద్యోగంచేస్తున్నా జీతంలో ఏమీ మిగల్చలేకపోయింది తను. సంవత్సరమయి పెరిగిన యింక్రిమెంట్లూ, డియ్యేలూ, ఎరియర్సూ ఒక దగ్గర వేస్తోంది. అవే పట్టుకుని రైలెక్కాలనుకుంది. కానీ యిప్పుడు అవి పట్టుకోకపోతే తండ్రి పాడె క్కడు! మనిషి బ్రతికున్న రోజుల్లో కంటె చచ్చేకే ఎక్కువ ఖర్చు

చేసే దేశం కాబట్టి తప్పదు. ఆకలితో చస్తున్నా పైసా ధర్మం చేయని వాడు ఆ మనిషి పోతే దినవారాలకి ఖర్చు చేస్తారు- వందలకువందలూ ఈ రోజుల్లో బీద మనిషి చావు ఖర్చు మధ్య తరగతి సగటు కుటుంబపు నెల ఖర్చు.

చీకటి బాగా పడింది. శవందగ్గర దీపం పెట్టేరు. పరామర్శించడానికొచ్చిన వూళ్ళో వాళ్ళంతా వెళ్ళిపోయారు. ఉన్న బంధువులు ఎక్కడివాళ్ళక్కడ జారగిలబడి యిబ్బందిగా కూర్చున్నారు.

కడుపులో పేగులు కరకరలాడేయి కాళిందికి. 'కరుణానిధి ఏం చేస్తుంటాడీపాటికి?' అనుకుంది. 'బహుళ— ఇంటికి వెళ్ళి భోజనం చేసి, డబుల్ కాట్ ఫోంబెడ్ మీద పడుకుని హాయిగా ఏ ఇంగ్లీషు నవలో చదువుకుంటూ వుంటాడు!

ఒక్కమారు వెళ్ళింది తను కరుణానిధి యింటికి. ఆ రోజు తనను టీకి ఆహ్వానించాడు కరుణానిధి. ఇబ్బందిపడినా తప్పలేదు—ఆరోగ్యకరమైన వాతావరణంలో అందంగా కట్టబడిన అద్దాలమేడలో మేడమీది ఫ్లాట్ కరుణానిధిది. ముందు కాంపౌండ్‌లో ఎన్నెన్నోపూలమొక్కలు

కరుణానిధి భార్య ఎంతో అందమైనది. చచ్చిన దాని కళ్ళు చారడేసి అంటారు. ఆల్బమ్‌లో భార్య ఫొటోలు చూపించాడు. అంత చిన్న వయసులో ఆమె పోవడం ఆశ్చర్యాన్నే కలిగించింది. భార్య లేని వంటరితనం కరుణానిధిని బాధిస్తోందా?

"నా దెప్పుడూ వంటరి బ్రతుకే కాళింది గారూ! తల్లిదండ్రులకు ఒక్కణ్ణి. తండ్రి ముఖమే గుర్తు లేదు- ఆరేళ్ళ నేవీలో యే బంధాలూ లేకుండా బ్రతికేను- శరీరానికి తిండి, పని, నిద్ర- మెదడుకు పుస్తకాలూ- హాయేజ్‌లో వుండగానే తల్లిపోయింది.

త్రిపుర నా జీవితంలోని ఒంటరితనాన్ని పోగొడుతుందనుకున్నాను. కానీ మా దాంపత్య జీవితం ఆరేళ్ళలో యిద్దరి పిల్లలతో

ముగిసిపోయింది. లివర్ కేన్సర్ అందమైన ఆమె శరీరాన్ని నాశ్నా కుండా చేసింది. ఆమెపుట్టిన రోజీవేళ. ఈ రోజెందుకో మిమ్మల్ని పిలవాలనిపించింది. మీతో నాబాధను పంచుకోవాలనిపించింది."

కరుణానిధి మాటలు తనలో కలవరాన్నే రేపాయి.

ఎక్కడో ఏదో శబ్దమైతే ఆలోచనల్లోంచి తేరుకుని చూసింది కాళింది– రాత్రి బాగా పొద్దుపోయింది. శవ జాగరణ–ఇల్లంతా విషాదం తాండవిస్తోంది. ఎవరి మట్టుకు వారు ఆలోచనల్తో ఏడ్చి అలసిన ముఖా లతో ఉన్నారు. ప్రయివేటు కుర్రాడు సుబ్బారావు మాత్రం వరండాలో దీపం క్రింద కూర్చొని గీత చదువుతున్నాడు.

నిద్రో.... మైకమో.... కాళిందికి కళ్ళు మూతలు పడుతున్నాయి

ఆలోచనలు దొంతర దొంతరలుగా—

"ఈ ఒంటరి బ్రతుక్కి తోడుకావాల్సిన అవసరమేర్పడుతోంది కాళిందీ, ఆ తోడు మీరే ఎందుక్కాకూడదూ" అని కరుణానిధి అన్న పుడు మౌనం వహించిందే తప్ప తృణీకరించ లేదు– దానిక్కారణం అతనిపట్ల తనకున్న ప్రేమా? జాలా? ఏమో!

అతని హోదాకీ, డబ్బుకీ లోబడటం లేదు గదా! ఎన్నాళ్ళో ఆలోచించింది.

తనపట్ల అతనా విధమైన అభిప్రాయా న్నేర్పరుచుకోడానికి తనలో ఏ ఆకర్షణా లేదు.

ఆ మాటకొస్తే అతని అభిప్రాయంతో తను ఏకీభవించడానికి ఆలోచనతో పనిలేదు. అతనికేంలోటు? అనుభవించడానికి అరోగ్యమూ ఐశ్వర్యమూ వున్నాయి. ఉన్న యిద్దరు పిల్లల్నీ రెసిడెన్షియల్‌స్కూల్లో చదివిస్తున్నాడు.

తనకు అభ్యంతరం లేకపోయినా కులం వేరు కాబట్టి తండ్రి ఒప్పుకోడని జంకింది కొన్నాళ్ళు– ఆ తర్వాత ఆ జంకూ పోయింది–

తనకు కావలసింది జీవితం- తనను అభిమానించే, ప్రేమించే వ్యక్తితో జీవితాన్ని పంచుకోవడం. దానికోసం రిస్కు తీసుకోక తప్పదు- ఆ నిర్ణయం తీసుకునే ముందడుగు వేసింది.

రాత్రి తెల్లవారింది. అంతా లేచారు తండ్రితప్ప-'మీ అన్నయ్య యింకా రాలేదేమమ్మా కాళిందీ'- అవధాని ఆతృత-

"టెలిగ్రాం లేటుగా అందిందేమో నండీ!"

అయినా ఎందుకొస్తాడూ? బతికుండగా చూడని వాడు చచ్చేక చూస్తాడా? వస్తే ఖర్చు నెత్తిన పడదూ?

"ఏవమ్మోయ్- ఈ పూటైనా శవాన్ని తీస్తారా లేదా? నిన్న మధ్యాహ్నం నించీ తిళ్ళూ తిప్పలూ లేక పిల్లల్తో వస్తులున్నాం- మీరూ ఆలోచించాలి. పోయిన వాళ్ళతో పోలేం గదా" ఇంటిగలావిడ కంఠం ఖంగుమంది.

ఆవిడన్నదీ నిజమే మరి!

"పెద్దకొడుకు- ఆ తంతువాడి చేతులమీదుగా జరక్కపోతే ఆయన ఆత్మకు శాంతి వుండదు. అంత దుఃఖంలోనూ తల్లి నోరు విప్పింది-

అట్నించి రావలసిన రైళ్ళన్నీ వచ్చేశాయి, ఉదయం 11 గంటకు రావలసిన ఆఖరి బండికూడ వచ్చి వెళ్ళిపోవడంతో అందరిలోనూ ఆతృత మొదలయింది.... మళ్ళీ రాత్రికిగాని రైలు లేదు.

"ఒంటిగంట వరకూ చూద్దాం. ఆ తర్వాత ఎవరో ఒకరు- ఏం చేస్తాం?" ఎవరో అన్నారు.

ఆ సమస్య ఎదురయ్యేసరికి వున్న మగవాళ్ళు నలుగురూ నాల్గువైపులా జారుకున్నారు. ఏం దారి?

పరిస్థితిని చూసిన సుబ్బారావే కలగజేసుకున్నాడు. "అమ్మగారూ! మీ కభ్యంతరం లేకపోతే నేను చేస్తాను."

అందరి చూపులూ ఆశ్చర్యంగా అతనిమీదే నిలిచే యా క్షణాన

సుబ్బారావు బంధువు కాడు. మాష్టారి స్నేహితుడూ కాదు—మాష్టారి దగ్గర సంస్కృతం నేర్చుకున్న ఒక విద్యార్థి. అంతే!

తల్లి వంక చూపింది కాళింది—సుందరమ్మగారు తల దించుకుంది ఏం మాట్లాడకుండా నే.

సుబ్బారావు కొన్నాళ్ళు వారాలు చేసుకుని చదువుకున్నాడు. అతగాడి తల్లి తమ యింట ఏ కార్యమొచ్చినా వంటలు చేసేది.

"ఎవరికెలా రాసిపెట్టి వుందో? కాదనకండి. ఆయన దగ్గర చదువుకున్నాడు. ఆయనింట తిన్నవాడూ కొడుకులాంటివాడే—"

ఏమైతేనేం అంతా రాజీకి వచ్చారు. అపరాహ్ణం దాటేక శవం కదిలింది.

ఆ మర్నాడు ఉదయం వచ్చేడు వెంకట్రావు భార్యను తీసుకుని. మళ్ళీ ఏడుపులు, పెడబొబ్బలు—

సమయానికి టెలిగ్రాం అందలేదనీ, సెలవు దొరకలేదనీ—

అన్నగారి మాటలు సాకులు గానే అన్పించాయి కాళిందికి.

'కొడుకునయి వుండీ నా కా యోగ్యత లేకపోయింది' భోరున యేడ్చాడు వెంకట్రావు.

పదోనాడు జరగాల్సిన తంతూ. దానాలూ అన్నీ మాటల్లో కొచ్చాయా రాత్రి. అన్నీ యథావిధిగా జరపాలనే నిర్ణయం జరిగేక చెల్లెల్ని పక్కకు పిలిచి అసలు సంగతి చెప్పాడు వెంకట్రావు.

"నా అసమర్థతను నీకెలా చెప్పాలో అర్థం కావటం లేదే కాళిందీ. నాలుగునెలల క్రితం లీవ్ ట్రావెల్ కన్వెషన్ మీద కాశ్మీర్ వెళ్ళొచ్చాము; రెండువేలయింది. ప్రావిడెంట్ ఫండ్‌లోనూ, ఎన్‌కేష్‌మెంటూ మొత్తం అన్నీ అయిపోయాయి. జీతంలో కోతలు మొదలయి రెండునెలల్నించే డబ్బు కిబ్బందిగా వుంది. వచ్చేనెల పిల్లల కాన్వెంట్ టర్మ్ ఫీజులు కట్టాలి. ఈ టెలిగ్రాం అందడంతో రైలు ఖర్చులకు అప్పుజేసి బయల్దేరేం!"

ఓ క్షణ కాలం నిశ్చేష్టురాలయింది కాళింది.

వప్పజెప్పవలసిన వన్నీ సరిగా చెప్పాడో లేదో నన్నట్లు తలుపుచాటు నించి వింటున్న వదినగారు కన్పించేరు. అవును మరి! పెళ్ళయ్యాక ఎవరి సంసారాలు, ఎవరి ఖర్చులు వారివి!

మరి తనకూ పెళ్ళయితే....? ఎంత డబ్బున్నా ఆడపిల్ల పుట్టింటికి పెట్టడాన్ని ఎవరూ హర్షించరు.

"అసలు రాకూడదనే అనుకున్నాను-సమయానికి లేనపుడు ఇంకెందుకూ? నువ్వున్నావనే ధైర్యంతోనే బయలుదేరాను."

"పోన్లేరా. ఎలాగో చూద్దాం" అంది కాళింది.

కర్మకాండ క్లుప్తంగానే ముగిసింది.

బంధువులు ఒకళూ ఒకళే వెళ్ళిపోతున్నారు.

కాళింది మాత్రం అన్నగారి మాట కోసం ఆత్రంగా ఎదురు చూస్తోంది. ఆమె మనసు నిండా ఆలోచనలు.

కొలిమిలో కాలిన బంగారం ఆకర్షణీయంగా మెరుస్తుంది. మూఢాచారాల ముళ్ళ పొదల్లోంచి బయట పడ్డానికి ప్రయత్నిస్తున్న తల్లి తన దారి కడ్డురాకపోవచ్చు. కానీ....పై ఏడాదికి చెల్లెలు పదోతరగతికీ, తమ్ముడు ఏడో తరగతికీ, వస్తారు. వాళ్ళ భవిష్యత్తో?

వెళ్ళే రోజు వరకూ వెంకట్రావేం మాట్లాడకపోవడం చూసి కాళిందే కదిపింది-'అమ్మని నీతో తీసుకెళ్తున్నావురా' అంటూ.

వెంకట్రావు నా ప్రశ్న ఇబ్బందినే కలిగించింది.

"అక్కడి క్వార్టర్స్ సంగతి నీకు తెలియందేముంది కాళిందీ. పైగా అమ్మ కక్కడ మడీ. ఆచారం కుదరదు. ఇక్కడ నువ్వున్నావు-పిల్లలు చదువుకుంటున్నారు-అప్పుడప్పుడు నేనూ..."

అటుపై మాట లిక వినలేదు కాళింది.

తను కట్టుకున్న మేడలన్నీ ఒక్కమారు కూలిపోయినట్లని పించిందామెకు.

అవును మరి-తనూ ఆ తల్లి సంతానమేగా. వాడొక్కడే చేయాలని మాత్రం ఏముంది? తనూ వుద్యోగం చేస్తూంది. ఆదుకోక ఏం చేస్తుంది! ఎక్కడికి పోతుంది?

ట్రైన్ కదులుతూంటే కళ్ళంట నీళ్ళు తిరిగాయి కాళిందికి.

తమ్ముణ్ణీ, చెల్లెల్నీ రెండు చేతులతోనూ దగ్గరకు తీసుకుంది.

చివరి పెట్టె ప్లాట్‌ఫాం దాటేక వెనక్కు తిరిగింది.

చుట్టూ జనం....రిక్షలూ, ఆటోలూ, కార్లూ, స్కూటర్లూ.

తనెక్కవలసిన రైలు ఎప్పుడో వెళ్ళిపోయింది-ఒక జీవితకాలం ముందుగానే నేమో!

"హలో!కాళిందీ!" పరిచయమున్న గొంతువినిఅటువంకచూసింది.

కరుణానిధి!

"ఐయాం వెరీ సారీ కాళిందీ. విషయం తెల్సినా రాలేకపోయాను నీకు తెల్సుగా నా కట్లాంటి ఫార్మాలిటీస్ తెలీవని, దుఃఖంలో ఉన్న వారిని పలుకరించి వారి జ్ఞాపకాలను తవ్వి వారికి మరింత దుఃఖాన్ని కలుగ జెయ్యడం నా కిష్ట ముండదు. జరిగిందానికి నేనూ విచారించాను."

కాళిందికి కన్నీరాగింది కాదు,

"ఛీ....చిన్నపిల్లలా ఏమిటది? రా కారెక్కు...." డోర్ తెరిచి చెయ్యందించాడు.

కనురెప్ప లెత్తి; నీళ్ళు నిండిన కళ్ళతో అతని కళ్ళలోకి చూసింది.

"సారీ నిధిగారూ. నేనిప్పుడు ఒంటరిదాన్ని కాదు. నా వెనుక నా తమ్ముడూ- చెల్లెలూ.... బాధ్యతలూ, బరువులూ....చదువులూ. పెళ్ళిళ్ళూ....ఎన్నో! మీ చెయ్యందుకుని నిస్వార్థంగా ఒక్కదాన్నే రాలేనే మో! క్షమించండి!"

0 0 0

భయం భయంగా లోపలికి అడుగు పెట్టింది కాళింది.

పదిహేను రోజుల తర్వాత మళ్ళీ ఆఫీసు కొచ్చింది—సీట్లో కూర్చోబోతుండగా గోడ గడియారం పది గంటలు కొట్టింది.

గుండెలు దడదడలాడేయి.

మళ్ళీ తోటి ఉద్యోగుల సానుభూతి వాక్యాలూ, పరామర్శలూ.

కరుణానిధి చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

మనిషికి చావు సహజం.

బరువైన బ్రతుకుకంటె సహజమైన చావే గొప్పదేమో!

చాలా సేపటి వరకూ బాస్ నుండి పిలుపు రాలేదు. అయితే తననుకున్నది నిజమౌతుందా? అన్నిటికీ సిద్ధపడే వచ్చింది—

ఇంతలో పిలుపు రానే వచ్చింది కరుణానిధి నుండి.

జీవితమనే జారుడు బల్లమీద తను జాగ్రత్తగానే అడుగు వేసింది కానీ దొరికిన ఆధారాన్ని విసిరికొట్టింది. దాని పర్యవసానం?

నుదుటిమీది చమటను పైటకొంగుతో అద్దుకొని పుస్తకం, పెన్సిలు తీసుకుని లోపలికి నడిచింది.

గదినిండా చల్లదనం—ఎదురుగా కరుణానిధి!

ఎంత నిర్భయంగా వుండేది బాస్ దగ్గర తను? ఇప్పుడీ పరిస్థితి

'ప్లీజ్ బీ సీటెడ్!' తలెత్తకుండానే టేబిల్ సొరుగులోంచి కవరుతీసి అందించేడు.

టెర్మినేటింగ్ ఆర్డర్సా? వణుకుతున్న చేతుల్తోనే తీసుకుని తెరిచింది.

'ఈ వంటరి బ్రతుక్కి చేయూత నివ్వాల్సింది నువ్వే కాళిందీ. ఆదుకునే చేతుల్లోని బరువు బాధ్యతలను అందుకోడానికి యీ చేతులెప్పుడూ సిద్ధమే'

ఉద్వేగంతో ఆమె హృదయం ఎగిరిపడింది. కళ్ళు ఆనందంతో వర్షించాయి. బురదలోంచి పుట్టిన పువ్వులా దుఃఖంలోంచి చిరునవ్వు విరిసింది.

ఆలస్యంగా వచ్చినా, చిక్కని వెన్నెలే తన జీవితంలోకి సోకింది. సంతృప్తిగా నిట్టూర్చింది కాళింది.